ఇరిగేషన్ అక్రమాలపై విచారణ

- జస్టిస్ పిసి ఘోష్ నేతృత్వంలో కమిటీ
- 2008 డిఎస్‌సి అభ్యర్థులకు మినిమం పేస్కేల్‌తో ఉద్యోగాలు
- అర్హులందరికీ తెల్లరేషన్ కార్డు
- 15 అంశాలతో మహిళా శక్తి ప్రత్యేక పథకం
- మంత్రిమండలి నిర్ణయాలు



మంత్రి మండలి సమావేశంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో జరిగిన అక్రమాలను నిగ్గుతేల్చేందుకు

రిటైర్డ్ న్యాయమూర్తులతో రాష్ట్ర ప్రభుత్వం విచారణ కమిటీలను నియమించనుంది. ఈ ప్రతిపాదనలకు

తెలంగాణ రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణ కమిటీకి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వం వహిస్తారు. కాళేశ్వరంతో పాటు గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఇరిగేషన్ ప్రాజెక్టుల టెండర్లు, డిజైన్, పనుల నాణ్యత, చెల్లింపులు తదితర అన్ని అంశాలపై ఈ కమిటీ సమగ్రంగా విచారణ జరపనుంది. విద్యుత్ కొనుగోలు టెండర్లు, తదితర అంశాలపై హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి అధ్యక్షతన విచారణ కమిటీని ప్రభుత్వం నియమించనుంది. ఈ రెండు కమిటీలు ఆయా అంశాలపై సమగ్రంగా విచారణ చేసి వంద రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నాయి.లమంగళవారం డా.బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. పలు అంశాలపై కేబినేట్‌లో చర్చ జరిగింది. మంత్రిమండలి నిర్ణయాలను రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఐటి మంత్రి శ్రీధర్ బాబు, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాకు వివరించారు.

ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు చొప్పున రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇళ్ల నిర్మాణానికి రూ.22,500కోట్లు కేటాయించేందుకు కేబినేట్ ఆమోదం తెలిపింది. లబ్దిదారులను గ్రామసభల్లో ఎంపిక చేయనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. అర్హత కలిగినవారందరికీ తెల్లరేషన్ కార్డు మంజూరు చేయాలని కేబినేట్ తీర్మానించింది.కొత్తగా ముదిరాజ్ కార్పోరేషన్, యాదవ కురుమ, మున్నారుకాపు, పద్మశాలి, పెరిక, లింగాయత్, మేర, గంగపుత్ర, ఆర్యవైశ్య, రెడ్డి,మాదిగ, మాల, కులాల కార్పోరేషన్లతో పాటు కొమురం బీం ఆదివాసీ కార్పోరేషన్, సంత్ సేవాలాల్ లంబాడి కార్పోరేషన్,ఏకలవ్య కార్పోరేషన్ల ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించిందని పొంగులేటి తెలిపారు. ఔటర్ రింగ్‌రోడ్ చుట్టూ మహిళా రైతు బజార్లను ఏర్పాటు చేయనున్నారు. స్వయం సహాయక సంఘాలు తయారుచేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు వీలుగా ఒఆర్ఆర్ పరిధిలో 25 ఎకరాల్లో కాంప్లెక్స్ నిర్మాణానికి కేబినేట్ ఆమోదముద్ర వేసింది. వచ్చే మూడు రోజుల్లో 92 శాతం రైతులకు రైతుభరోసా జమ చేయనున్నట్లు మంత్రి చెప్పారు. డ్వాక్రా మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు 15 అంశాలతో మహిళా శక్తి ప్రత్యేక పథకం తీసుకురావాలన్న ప్రభుత్వ ప్రతిపాదనకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2008 డిఎస్‌సి అభ్యర్థులకు మినిమం పే స్కేలు ఇచ్చి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని మంత్రిమండలి నిర్ణయించింది. వేసవికాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలను రాష్ట్ర కేబినేట్ ఆదేశించినట్లు మంత్రి పొంగులేటి వివరించారు.

యాదాద్రిలో భట్టి, కొండా సురేఖపై కులవివక్ష

- బాధ్యులను చట్ట ప్రకారం శిక్షించాలి : సిపిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాదాద్రి ఆలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పట్ల ఆలయ నిర్వాహకులు కులవివక్షను ప్రదర్శించారని సిపిఎం రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రితోపాటు సందర్శించిన మంత్రుల్లో వారిద్దరినీ మాత్రమే వేరుగా చూశారని తెలిపారు. సీఎం దంపతులకు, అగ్రవర్ణాలకు చెందిన ఇతర మంత్రులకు కుర్చీలు వేసి, వారిద్దరిని మాత్రం చిన్న పీటలమీద కూర్చోబెట్టి కులవివక్షను ప్రదర్శించారని పేర్కొన్నారు. సిఎం సమక్షంలో వివక్ష ప్రదర్శించడం మరింత ఆందోళనకరమని తెలిపారు. ఇతర మంత్రులు కూడా కనీసం ప్రొటోకాల్ పాటించలేదని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి కూర్చున్న తర్వాత మిగిలిన స్థానాల్లో వారు కూర్చుని ఉంటే హుందాగా వివరించారు. ఈ ఘటనపై విచారణ జరిపించాలనీ, కుల వివక్షకు బాధ్యులైన వారిని చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు.

ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా రాష్ట్ర చిహ్నం

- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రజల ఆకాంక్షలతోపాటు రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా రాష్ట్ర చిహ్నం ఉండాలని అధికారులకు మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రివర్గ ఉప సంఘం సమావేశమైంది. 'రాష్ట్ర చిహ్నం, రాష్ట్ర విగ్రహం, రాష్ట్ర గీతం ఖరారు తదితరాంశాలపై చర్చించింది. సమావేశానికి మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, కొండా సురేఖ తదితరులు హాజరయ్యారు. ప్రజాస్వామ్య ఆనవాళ్లను ప్రస్ఫుటించేలా రాష్ట్ర చిహ్నం ఉండాలని తెలిపారు. తెలంగాణ విగ్రహం రాష్ట్రంలోని సామాన్య మహిళను గౌరవించేలా ఉండాలని సూచించారు. రాష్ట్ర గేయానికి సంబంధించి ప్రముఖ కవి అందెశ్రీతో చర్చించి నేటి కాలానికి అనుగుణంగా 'జయజయ హే' పాటకు కొన్ని మార్పులు చేర్పులు చేయాలని సూచించారు. ప్రముఖ కళాకారులు, మేధావులతో రాష్ట్ర చిహ్నం, విగ్రహానికి సంబంధించిన డిజైన్‌లను రూపొందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్ర చిహ్నం, రాష్ట్ర గీతం, రాష్ట్ర విగ్రహం చిహ్నాల్లో రాష్ట్రానికి సంబంధించిన అంశాలు ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. చిహ్నంపై నాగార్జునసాగర్ డ్యామ్, ఇతర ముఖ్యమైన ఐకానిక్ చిత్రాలు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. మెజార్టీ ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా ఏ ఒక్క వర్గం మనోభావాలు దెబ్బతినకుండా రాష్ట్ర చిహ్నాన్ని రీడిజైన్ చేయాల్సిన అవసరం ఉందని మంత్రి కొండా సురేఖ అభిప్రాయపడ్డారు. రాష్ట్ర గీతంలో అన్ని జిల్లాలకు చోటు కల్పించాలన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయ విలువలను ప్రతిబింబించేలా తెలంగాణ మహిళ విగ్రహాన్ని రీడిజైన్ చేయాలని మంత్రి సీతక్క కోరారు. సమావేశంలో సిఎం రాజకీయ కార్యదర్శి రఘునందన్ రావు, పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి శైలజా రామయ్యర్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు, ప్రొటోకాల్ డైరెక్టర్ అరవిందర్ సింగ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

స్కూల్ యూనిఫారాల'కుట్టు' పని స్వయం సహాయక సంఘాలకే సర్కారు జిఒ జారీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థులు, ఇతరులకు ప్రభుత్వం సరఫరా చేసే యూనిఫారాల కుట్టు పని స్వయం సహాయక సంఘాలకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం జిఒ నెంబరు 14ను ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానీయా ఉత్తర్వులు ఇచ్చారు. మహిళల ఆధ్వర్యంలో నడిచే గ్రామీణ ప్రాంతాల్లో ఎస్‌హెచ్‌జీలకు, పట్టణాల్లో పట్టణ స్థానిక సంస్థలకు కుట్టుపని అప్పగించారు. రాష్ట్ర వ్యాప్తంగా 63,44,965 జతలు అవసరమవుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. విద్యాశాఖతోపాటు రెసిడెన్సియల్, హాస్టల్ విద్యార్థులకు ఈ యూనిఫారాలను ప్రభుత్వం అందించనుంది. ఈమేరకు గత జనవరి 30న సిఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సమీక్ష చేసి స్వయం సహాయక సంఘాలకు కుట్టు పని బాధ్యతలు ఇవ్వాలని ఆదేశించారు. సర్కారు నిర్ణయంతో ఏర్పాట్లు చేయాలని ఆయా జిల్లాల కలెక్టర్లు, జిహెచ్ఎంసి అధికారులకు మార్గదర్శకాలు ఇచ్చింది. బట్ట అందజేసిన 45 రోజుల్లో కుట్టు పనిపూర్తి యూనిఫారాలను సిద్ధం చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

సిరిసిల్ల పవర్‌లూంపరిశ్రమను తెరిపించండి

- చేనేత కార్మికుల ఆత్మహత్యలను నివారించండి
- సిఎం రేవంత్‌రెడ్డికి తమ్మినేని లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిరిసిల్ల పవర్‌లూం పరిశ్రమను తెరిపించాలనీ, తద్వారా చేనేత కార్మికుల ఆత్మహత్యలను నివారించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారికి ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన మంగళవారం లేఖ రాశారు. రాష్ట్రంలో రెండు లక్షలకు పైగా చేనేత, పవర్‌లూం కార్మికులు వస్త్ర పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారని వివరించారు. సిరిసిల్లలో గత మూణ్నెల్లుగా వస్త్ర పరిశ్రమ పూర్తిగా సంక్షోభంలోకి కూరుకుపోయి మూతపడిందని తెలిపారు. దీంతో ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ భారమై ఈనెల 11న తడుక శ్రీనివాస్ (42) అనే పవర్‌లూం కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డారని గుర్తు చేశారు. మరోవైపు ఆ పరిశ్రమ కార్మికులు గత 15 రోజులుగా ఆందోళన చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్మికులకు ఉపాధి కల్పన కోసం బతుకమ్మ చీరలతో పాటు గిరిజన, బిసి సంక్షేమ గురుకులాలు, ఆర్‌విఎం, కెజిబివి తదితరాలకు వస్త్రాలను టెస్కో ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక చేనేత సహకార సంఘాల కార్మికులతో ఉత్పత్తి చేయించారని తెలిపారు. కానీ వివిధ శాఖలు టెస్కోకు, ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు రూ.485.89 కోట్లు చెల్లించలేదని వివరించారు. ఈ బకాయిలను చెల్లించకపోవడంతో యాజమాన్యాలు వస్త్ర పరిశ్రమలను నిలిపేశాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని చేనేత కార్మికులకు ఉపాధి కల్పించడానిక ప్రభుత్వ సంస్థలైన గ్రామ పంచాయతీ, మున్సిపల్, ఆశా, అంగన్‌వాడీ, సింగరేణి, ఆర్‌టిసి, పోలీస్, ప్రభుత్వ ఆస్పత్రులు, కార్యాలయాలు, గురుకుల పాఠశాలలు తదితర సంస్థలకు అవసరమయ్యే వస్త్రాలను చేనేత కార్మికులతో ఉత్పత్తి చేయించాలని సూచించారు. ఫలితంగా చేనేత, పవర్‌లూం కార్మికుల కుటుంబాలకు ఉపాధి దొరుకుతుందని తెలిపారు. వారి ఆకలి చావులు, ఆత్మహత్యలను నివారించొచ్చని కోరారు. తక్షణమే పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్‌లో 'ప్రపంచ వరి సదస్సు'

- ప్రభుత్వ భాగస్వామ్యంతో జూన్ 4 నుంచి ప్రారంభం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో జూన్ 4 నుంచి 6 వరకు హైదరాబాద్‌లో ప్రపంచ వరి సదస్సును నిర్వహించబోతున్నదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. అంతర్జాతీయ కామోడిటీస్ సంస్థ, కాలిఫోర్నియా, అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ (ఫిలిప్పైన్స్) సంయుక్తంగా ప్రపంచ వరి సదస్సును నిర్వహిస్తున్నాయని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 22 ఏండ్లుగా వివిధ దేశాల్లో ప్రపంచ వరి సదస్సులు జరుగుతున్నాయనీ, తొలిసారిగా హైదరాబాద్‌లో జరగడం గర్వకారణమని తెలిపారు. సదస్సులో 28 దేశాల నుంచి దాదాపు 500 మంది విదేశీ ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, వ్యాపారసంస్థల ప్రతినిధులు, ఎగుమతి, దిగుమతిదారులు, విద్యావేత్తలు, ప్రభుత్వం రంగంలోని వ్యవసాయ పారిశ్రామిక వేత్తలు, వరి అనుబంధ ఉత్పత్తుల రంగాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు, స్టార్టప్ కంపెనీల ప్రతినిధులు కూడా పాల్గొంటారని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు.

తరలిపోతున్న పెట్టుబడులను ఆపండి

- ఎక్స్ వేదికగా కెటిఆర్ ఆవేదన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ నుంచి తరలిపోతున్న పెట్టుబడులపై మాజీ మంత్రి కెటిఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆయన ఇదే అంశాన్ని ప్రస్తావించారు. తమ ప్రభుత్వ హయాంలో పదేండ్లుగా రాష్ట్రానికి పెట్టుబడులను తీసుకువచ్చేందుకు చేసిన కృషి ఇప్పుడు నిష్ఫలమవుతోందని వ్యాఖ్యానించారు. సెమీ కండక్టర్ రంగంలో అత్యంత కీలకమైన పెట్టుబడిగా భావిస్తున్న కేన్స్ సెమికాన్ సంస్థ గుజరాత్‌కు తరలిపోతున్నట్లు వచ్చిన వార్తలపై ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే కంపెనీ యాజమాన్యంతో చర్చలు జరిపి రాష్ట్రంలోనే పెట్టుబడులను కొనసాగించేలా సూచించారు.

ఆర్‌టిసి రక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిదీ

- సంస్థ నష్టాల్లో నుంచి లాభాల్లోకి రావడం గర్వకారణం
- మహాలక్ష్మి పథకంతో వంద శాతం పెరిగిన ఆక్యుపెన్సీ
- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క
- ఆర్‌టిసి బలోపేతం, అభ్యున్నతికి సహకారమందిస్తాం
- మంత్రులు పొన్నం, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- 22 ఎలక్ట్రిక్ నాన్ ఎసి బస్సులను ప్రారంభించిన మంత్రులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణకు తలమానికమైన ఆర్టీసీని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రభుత్వం ప్రజా రవాణా వ్యవస్థ ప్రాముఖ్యతను గుర్తించి.. 90 రోజుల్లో అనేక కార్యక్రమాలు తీసుకొచ్చిందని వివరించారు. హైదరాబాద్ ఎన్‌టిఆర్ మార్గ్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ ఆర్‌టిసికి చెందిన గ్రీన్ మెట్రో ఎక్స్‌ప్రెస్ నాన్ ఎసి బస్సుల ప్రారంభోత్సవానికి మంగళవారం ఉప ముఖ్యమంత్రితోపాటు రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. పర్యావరణహితమైన 22 ఎలక్ట్రిక్ నాన్ ఎసి బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అక్కడి నుంచి మంత్రులు ఎలక్ట్రిక్ బస్సులో సచివాలయానికి వెళ్లారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడు తూ..గతంలో నష్టాల్లో ఉన్న టిఎస్ఆర్‌టిసి మహాలక్ష్మి పథకం ద్వారా లాభాల్లోకి వెళ్లడమనేది తెలంగాణకే గర్వకారణమని తెలిపారు. మహిళల టికెట్ డబ్బును ఆర్‌టిసికి ప్రభుత్వం ఎప్పటికప్పుడూ చెల్లిస్తోందన్నారు. ఆర్‌టిసి సిబ్బంది కష్టాన్ని, శ్రమను గుర్తించే వేతన సవరణ చేసి.. 21 శాతం ఫిట్‌మెంట్‌ను ఇటీవల ప్రకటించామని గుర్తు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మహాలక్ష్మిపథకంవల్లటిఎస్ఆర్‌టిసి కళకళలాడు తోందని, ప్రతి బస్సు వంద శాతం ఆక్యుపెన్సీ రేషియో (ఒఆర్) తగ్గకుండా తిరుగుతోందని చెప్పారు. ఆర్‌టిసి పరిరక్షణ, సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాముఖ్యత ఇస్తోందన్నారు. తొలిసారిగా ఎలక్ట్రిక్ నాం ఎసి బస్సులను సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. మహాలక్ష్మి పథకాన్ని ఈ బస్సుల్లో కూడా అమలు చేస్తామని చెప్పారు. పెరిగిన రద్దీకి అనుగుణంగా భవిష్యత్‌లో మరిన్ని కొత్త బస్సులు వాడకంలోకి వస్తాయని, వాటి కొనుగోలుకు సంస్థకు ప్రభుత్వం సహాయసహకారాలు అందిస్తుందని వివరించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టిఎస్ఆర్‌టిసి అభ్యున్నతికి పాటుపడుతోందన్నారు. సంస్థ సిబ్బంది నిబద్ధత, అంకితభావం క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రతి రోజూ లక్షలాది మందిని క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చుతున్నారని కొనియాడారు. భవిష్యత్‌లోనూ ఇలాగే పనిచేస్తూ దేశంలోనే టిఎస్ఆర్‌టిసికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సంస్థ ఎండి విసి సజ్జనార్ మాట్లాడుతూ.. ఇటీవల తమ ఉద్యోగులకు 21 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించిన ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న ఐదారు నెలల్లో ప్రభుత్వ సహకారంతో 2515 బస్సులను వినియోగంలోకి తెచ్చేలా సంస్థ ప్రణాళిక చేసిందని తెలిపారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బాండ్లకు సంబంధించిన చెక్కులను టిఎస్ఆర్‌టిసి ఉద్యోగులు సరిత, సంజీవ్‌కు మంత్రుల చేతులమీదుగా అందజేశారు. ఈ ప్రారంభోత్సవంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, రవాణా శాఖ కమిషనర్ జ్యోతి బుద్దా ప్రకాశ్, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి, టిఎస్ఆర్‌టిసి సిఒఒ డాక్టర్ రవీందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వరావు, ఇడిలు మునిశేఖర్, కృష్ణకాంత్, వెంకటేశ్వర్లు, సిఎంఇ రఘునాథరావు తదితరులు పాల్గొన్నారు.



ఉపసంఘం సమావేశంలో మాట్లాడుతున్న రాజనర్సింహా

317 జిఒ సమస్యలను పరిష్కరిస్తాం

- 14న ఉద్యోగ సంఘాలతో సమావేశం
- గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు
- మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ దామోదర రాజనర్సింహ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 317 జిఒ ద్వారా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ దామోదర రాజనర్సింహ చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో 317 జిఒపై ఏర్పడిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశాన్ని రాజనర్సింహ అధ్యక్షతన నిర్వహించారు. ఉపసంఘం సభ్యులు మంత్రులు డి.శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. 317, 46 జిఒల వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులను అడిగి వారు తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులకు రాజనర్సింహ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. 317 జిఒలోని లోటుపాట్లు, పలు అంశాలపై లోతుగా అధ్యయనం చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఆ జిఒపై వివిధ ఉద్యోగ సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలతో ఈనెల 14న సాయంత్రం సమావేశం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఫిర్యాదులను స్వీకరించడానికి గ్రీవెన్స్‌సెల్‌ను ఏర్పాటు చేయాలనీ, రాష్ట్ర సర్వీసెస్ శాఖ సెక్రటరీ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని వివరించారు. అందుకు ఆన్‌లైన్ ద్వారా అవకాశం కల్పించాలని సూచించారు. వారి సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం ముందుకు వచ్చిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు, పిఆర్‌సి కమిటీ చైర్మన్ శివశంకర్, సచివాలయ సర్వీసెస్ సెక్రెటరీ నిర్మల, విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజాతోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సింగరేణిలో సిరులు కురిపిస్తాం

- జైపూర్‌లో మరో 800 మెగావాట్ల పవర్ స్టేషన్ ఏర్పాటు
- 'తాడిచెర్ల'ను సింగరేణికి ఇచ్చేందుకు కేంద్రం సానుకూలం
- హైదరాబాద్‌లో సింగరేణి గెస్ట్ హౌజ్ శంకుస్థాపనలో ఉపముఖ్యమంత్రి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి భట్టి విక్రమార్క, పక్కన పొన్నం ప్రభాకర్, ఇతర అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి కాలరీస్ ద్వారా రాష్ట్రానికి సిరుల పంట కురిపిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇక్కడి సొమ్మును ఇక్కడి కార్మికులు, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసమే ఖర్చు చేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ప్రభుత్వం కేటాయించిన వెయ్యి గజాల భూమిలో సింగరేణి కాలరీస్ గెస్ట్‌హౌజ్ భవన నిర్మాణానికి మంగళవారం ఉపముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టిఎస్‌జెన్‌కో ఆధీనంలో మూతపడిన 800 మెగావాట్ల రామగుండం థర్మల్ పవర్ స్టేషన్ పునర్నిర్మాణాన్ని సింగరేణికి అప్పగిస్తామని చెప్పారు. జైపూర్‌లో ప్రస్తుతం ఉన్న 1,600 మెగావాట్ల థర్మల్ కేంద్రాల వద్దే మరో 800 మెగావాట్ల థర్మల్ కేంద్రాన్ని నిర్మించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. నైనీ బ్లాక్ బొగ్గు గనుల పర్యావరణ అనుమతులు, తాడిచెర్ల బొగ్గు గనులను సింగరేణికి కేటాయించేందుకు కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ సూచనప్రాయ అంగీకారం తెలిపిందనీ, త్వరలో ఈ రెండూ అందుబాటులోకి వస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం సింగరేణి కార్మికులకు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. సింగరేణిలో బిసి లైజినింగ్ అఫీసర్ పోస్ట్‌కు అనుమతి ఇస్తున్నామనీ, అలాగే 1,352 ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేశామనీ, జిఒ 76 ప్రకారం నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లో 30వేల ఉద్యోగాలకు నియామకపత్రాలు అందచేశామని గుర్తుచేశారు.

అవమానించలేదు

యాదగిరి గుట్ట దేవాలయంలో తనకేదో అవమానం జరిగినట్టు సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారనీ, అది అవాస్తవమని ఉపముఖ్యమంత్రి అన్నారు. తాను పాదయాత్ర సమయంలోనూ యాదగిరిగుట్ట లో లక్ష్మీనరసింహస్వామి దర్శనం చేసుకున్నాననీ, తిరిగి అధికారంలోకి వచ్చి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొక్కు తీర్చుకోవడంలో భాగంగా తానే ఓ చిన్న పీట మీద కూర్చుని, అర్చకుల ఆశీర్వాదం తీసుకున్నానని తెలిపారు. దాన్ని సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేశారనీ, తనను ఎవరూ అవమానించలేదని స్పష్టం చేశారు. 'ఉప ముఖ్యమంత్రిగా, విద్యుత్, ఆర్థిక, ప్రణాళికా శాఖల మంత్రిగా ఈ రాష్ట్ర నిర్ణయాలను శాసిస్తున్నాను. ఎవరికో తలవంచేవాడిని కాదు. ఆత్మగౌరవం లేని వాడిని అసలే కాదు' అని అన్నారు. బహుశా ఆ ఫోటో చూసి ఎవరైనా మానసికంగా బాధపడితే మనస్ఫూర్తిగా అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే ఉద్యోగార్థుల కోసం రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్స్‌ను త్వరలో ఏర్పాటు చేస్తామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. తన పాదయాత్ర సందర్భంగా అనేకమంది పేదలు తమ పిల్లలకు చదువులు చెప్పించి, లక్షల రూపాయలు ఖర్చు పెట్టి హైదరాబాద్ వంటి చోట్ల పోటీ పరీక్షలకు శిక్షణ ఇప్పించడం తలకు మించిన ఆర్థిక భారంగా మారుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారని చెప్పారు. అందుకోసమే ప్రసిద్ధి చెందిన అధ్యాపకులతో ఆన్‌లైన్ ద్వారా బోధన ఇప్పించాలని, ఉద్యోగార్థులు హైదరాబాద్ రాకుండా ఎక్కడిక్కడే నాలెడ్జ్ సెంటర్లలో శిక్షణ తీసుకొనేలా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, గ్రేటర్ హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు జీ వినోద్, జీ వివేక్, రాజ్‌ఠాకూర్, ఐఎన్‌టియుసి నాయకులు జనక్ ప్రసాద్, మాజీ ఎంపీ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. సిఎండి బలరాం కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న మోడీ

- దృష్టి మళ్లించటానికే సిఎఎ చట్టం
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్
- సిఎఎ చట్టాన్ని వ్యతిరేకిస్తూ మోడీ దిష్టి బొమ్మ దగ్ధం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వివాదస్పద పౌరసత్వ సవరణ చట్టం అమలుకు కేంద్ర ప్రభుత్వం నిబంధనలను నోటిఫై చేయడంపై సిపిఎం వ్యతిరేకిస్తోంది. సిఎఎ అమలుపై కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని నిర్మల్ హృదయ్ స్కూల్ సెంటర్‌లో ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రం అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం అమలుకు పూనుకోవటం సిగ్గుచేటన్నారు. ఇది దేశంలో ప్రజల మధ్య మతపరమైన విభజనను తీసుకువచ్చే చట్టమని అభివర్ణించారు. సిఎఎ అమలు రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశాలతో తీవ్ర ఇబ్బందుల్లో పడిన బిజెపి, ఏ దారి కనపడని కారణంగా సమస్య నుంచి ప్రజల దృష్టిని మళ్లించడం కోసం సిఎఎ చట్ట నోటిఫికేషన్ విడుదల చేసిందని ఆరోపించారు. దేశంలో ఆకలి, నిరుద్యోగం, అధిక ధరలు, అభివృద్ధి, దళితులు, మైనార్టీలు, మహిళలపైన దాడులు, మణిపూర్ హింస వంటి అంశాలను పట్టించుకోకుండా కేవలం రాజకీయ దురుద్దేశ్యంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. అధికార బిజెపి ప్రతి అంశాన్ని హిందూ, ముస్లిం సమస్యగా ముందుకు తీసుకొచ్చి ఎన్నికల్లో లబ్ది పొందేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. నాలుగేళ్ల క్రితమే ఆమోదించిన చట్టాన్ని ఇన్నేళ్లు అమలు చేయకుండా కేవలం ఎన్నికల నేపథ్యంలో అమలు చేయడం ద్వారా మెజారిటీ హిందూ ఓటర్లను ప్రభావితం చేసే కుట్ర దాగున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో సిఎఎకు నిరసనగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశామన్నారు. కేరళ సిఎం పినరయి విజయన్ ఈ చట్టాన్ని మతపరంగా ప్రజలను విభజించే చట్టంగా అభివర్ణించి, అక్కడ ఈ చట్టాన్ని తమ రాష్ట్రంలో అమలు చేయబోమని స్పష్టం చేశారు.



సిఎఎ చట్టాన్ని వ్యతిరేకిస్తూ మోడీ దిష్టి బొమ్మను దగ్ధం చేస్తున్న సిపిఎం నాయకులు

కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎంఎ జబ్బార్, ఆర్ ప్రకాష్, ఖమ్మం టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, జిల్లా నాయకులు జిల్లా ఉపేందర్, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, ఎం గోపాల్, శివన్నారాయణ, సాగర్, గుమ్మడి బిక్షం, పడిగల నాగేశ్వరరావు, ఎం గణపతి, ఎం సైదులు, బిబి, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర భూసర్వే నిర్వహించాలి

- కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి
- భూ సదస్సులో వక్తల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమగ్ర భూ సర్వే నిర్వహించి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన భూ సదస్సులో వక్తలు డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలనీ, పంట నష్టంపై సర్వే జరిపి పరిహారం అందించాలనీ కోరారు. డంపింగ్ యార్డులు, రైతు వేదికలు, ఇతర ప్రభుత్వ అవసరాల కోసం రైతుల నుంచి తీసుకున్న భూములకు పరిహారం చెల్లించాలనే పలు తీర్మానాలను ఆమోదించారు.

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ మాట్లాడుతూ... 1940లో నిర్వహించిన సమగ్ర భూ సర్వే తర్వాత ఇప్పటి వరకు ఎలాంటి సర్వే జరగలేదని అన్నారు. నిజామాబాద్ జిల్లాను పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకుని సర్వే చేపట్టినా దాన్ని పూర్తి చేయలేదని గుర్తు చేశారు. 1971 పాసుపుస్తకాల చట్టాన్ని మార్చి బిఆర్ఎస్ ప్రభుత్వం 2020లో ఆర్ఓఆర్ చట్టాన్ని ధరణి పేరుతో తెచ్చారని చెప్పారు. ఆ పోర్టల్ వచ్చిన తర్వాత రైతుల సమస్యలు పరిష్కారం కాకపోగా, మరిన్ని పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. విఆర్ఓ, విఆర్ఎ వ్యవస్థలను పురరుద్ధరించాలనీ, కాస్తుకాలాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న 7.5 లక్షల ఎకరాల పోడు భూములకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డులు, రైతు వేదికలు, ఇతర ప్రభుత్వ అవసరాల కోసం రైతుల నుంచి తీసుకున్న భూములకు పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో సాగు నీరందించి పంటలను కాపాడాలనీ, పంటనష్టంపై రాష్ట్ర ప్రభుత్వం సర్వే జరిపి రూ.10 వేల పరిహారమందించాలని కోరారు. సదస్సుకు అధ్యక్షత వహించిన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ... ధరణి తర్వాత 16,57,407 భూ సమస్యలపై దరఖాస్తులు రాగా గత సర్కార్ 5,37,282 దరఖాస్తులను పరిష్కరించి, 5,37,984 దరఖాస్తులను తిరస్కరించిందని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న 2.45 లక్షల దరఖాస్తుల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ చేపట్టిందన్నారు. కొత్త దరఖాస్తుల ఆన్‌లైన్‌ను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భూ సమస్యలపై రాష్ట్రంలోని రైతు సంఘాలతో చర్చించాలని సూచించారు. ఎఐకెఎస్ జాతీయ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ.. పాసుపుస్తకాల చట్టం 26ను వెంటనే పునరుద్ధరించి పట్టాదారు, సాగుదారు, కౌలుదారు, తాకట్టుదారు అనే కాలాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. వీటిని పునరుద్ధరించకుండా ఎన్ని సంస్కరణలు చేసినా భూ వివాదాలు పరిష్కారం కావని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రైతు సంఘం ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ..భూ సదస్సులో అమోదించిన తీర్మానాలను మెమోరాండం ద్వారా ముఖ్యమంత్రిని కలిసి అందించనున్నట్టు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు మాట్లాడుతూ.. ధరణి వల్ల భూ స్వాములకు లాభం జరిగిందే తప్ప పేదరైతులకు కాదన్నారు. కొడంగల్, చౌటుప్పల్ తదితర ప్రాంతాల్లో వందల ఎకరాల భూములు వారి వశమయ్యాయని గుర్తు చేశారు. లోప భూయిష్టమైన ఈ పోర్టల్‌ను సమూలంగా ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు బి. ప్రసాద్ మాట్లాడుతూ.. కేరళ తరహాలో ఉపాధి హామీ పథకాన్ని పట్టణ పేదలకు అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ తదితరులు పాల్గొన్నారు.



ఉరితాళ్లతో నిరసన చేస్తున్న సాయిప్రియ నగర్ ఫ్లాట్స్ బాధితులు

సిఎం సారూ! మా ఘోష వినండి

- సాయిప్రియ నగర్ ప్లాట్స్ బాధితులు ఉరితాళ్లు వేసుకుని నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సార్ మా సమస్యను పరిష్కరించి న్యాయం జరిగేలా చూడండి. లేదా మీ చేతులతోనే ఉరివేసి మమ్మల్ని చంపేయండి' అంటూ సాయిప్రియ నగర్ ప్లాట్ల బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో బాధితులు మెడలో ఉరితాళ్లను వేసుకొని నిరసన తెలిపారు. అనంతరం బాధితులు మహేందర్, ప్రవీణ్ కుమార్, లక్ష్మి, ఉజ్వల మాట్లాడారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, పీర్జాదిగూడ మున్సిపాలిటీ, మేడిపల్లి మండలం పర్వతాపూర్ గ్రామంలో సర్వే నెంబర్లు 10, 11లోని స్థలాలను తామంతా రూపాయి రూపాయి కూడబెట్టుకుని 30 ఏళ్ల కిందట కొనుగోలు చేశామని తెలిపారు. రిజిస్ట్రేషన్ కూడా పూర్తి చేసుకొని సంబంధిత శాఖల అనుమతులతో గృహాలు నిర్మించుకొని విద్యుత్, నీటి బిల్లులు సైతం చెల్లిస్తున్నామన్నారు. అయితే సదరు స్థలంపై కన్నేసిన కొంతమంది స్థానిక నేతలు, రెవెన్యూ అధికారులు.. ఆ స్థలం ప్రభుత్వానిదని తమకు అన్యాయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తాము ఏళ్ల తరబడి న్యాయం కోసం పోరాటం చేస్తున్నామని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో సాక్షాత్తు ప్రస్తుత సిఎం రేవంత్‌రెడ్డి సైతం తమ పోరాటానికి మద్దతు పలికారని గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కూడా తమ స్థలాల నుంచి గెంటేసే ప్రయత్నం జరుగుతున్నా సిఎం రేవంత్‌రెడ్డి స్పందించకపోవడం ఆవేదన కలిగిస్తున్నదన్నారు. సుమారు 350మందికి పైగా బాధితులకు అన్యాయం జరుగుతున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యారంటూ కన్నీరు మున్నీరయ్యారు. చిన్నాచితక ఉద్యోగాలు చేసుకుంటూ సుమారు 30 ఏళ్ల కిందట కొనుగోలు చేసిన స్థలాల కోసం ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

కాలువ నీరు విడుదలకు రైతుల రాస్తారోకో

చివరి దశలో పంటలు ఎండుతున్నాయని ఆవేదన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్సారెస్పీ డి-87 ఉపకాలువ నుంచి పంటలకు నీరు విడుదల చేయాలని కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల కేంద్రంలో మంగళవారం రైతులు ఆందోళన చేశారు. మండల కేంద్రంలోని హైవే రోడ్డుపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఎస్ఆర్‌సిపి డి-87 కాలువ కింద కరీంనగర్ మండలం చామనపల్లి గ్రామంలో 400 ఎకరాలలో సాగు చేస్తున్న వరి, ఇతర పంటలు పూర్తిగా ఎండిపోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని పరిధిలో చొప్పదండి, కొలిమికుంట, చాకుంట, వెదురుగట్ట గ్రామాల రైతులకు సైతం నీరందక పంట పొలాలు బీడుగా వారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఆర్‌సిపి అధికారులు నీటిని వారాబందీగా విడుదల చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీరు విడుదల చేశాక రెండు మూడు రోజులకే.. ఎస్ఆర్‌సిపి మెయిన్ కెనాల్ నుంచి మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలతో డి-86 కాలువతో పెద్దపల్లికి మళ్లించారని ఆరోపించారు. ఇక్కడి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ రైతులను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చొప్పదండి సిఐ ప్రకాష్‌గౌడ్, ఎస్ఐ ఉపేంద్రచారి రైతుల వద్దకొచ్చి మాట్లాడారు. గత సంవత్సరం ఇదే నెలలో వడగండ్ల వర్షంతో పెద్దఎత్తున నష్టపోయామని, ఇప్పుడు పంటలు చేతికందే సమయంలో ఎస్ఆర్‌సిపి నుంచి నీటిని విడుదల చేయడంలో అధికారులు ఆలస్యం చేయడంతో పొలాలు ఎండుతున్నాయని రైతులు వివరించారు. ఎస్ఐ రైతులను సముదాయించి రాస్తారోకోను విరమింపజేశారు. ఎస్ఆర్‌సిపి డిఇతో ఫోన్లో మాట్లాడి.. రైతుల సమస్యను వివరించారు. ఎస్సారెస్పీ మెయిన్ కెనాల్ నుంచి 750పైన క్యూసెక్కుల నీళ్లు వస్తేనే డి-87కు నీటిని పూర్తిస్థాయిలో మళ్లించొచ్చని డిఇ తెలిపారు. ఉన్నత అధికారులతో మాట్లాడి నీరు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రైతులు చొప్పదండి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ నరేందర్‌కు, ఫోన్లో డిఇకి వినతిపత్రాన్ని అందజేశారు. రాస్తారోకోలో కరీంనగర్ మండలం చామన్‌పల్లి, చొప్పదండి, కొలిమికుంట, చాకుంట, వెదురుగట్ట రైతులు పాల్గొన్నారు.



కాలువ నీరు విడుదల చేయాలని రోడ్డు బైఠాయించిన రైతులు

డిఎస్‌సి అభ్యర్థులకు న్యాయం చేయాలి

సిఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే హరీశ్‌రావు లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



టెట్ నిర్వహించి డిఎస్‌సి అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతూ సిఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు మంగళవారం లేఖ రాశారు. 'రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకం కోసం డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే ఇటీవల కాలంలో టెట్ పరీక్ష నిర్వహించకపోవటం వల్ల దాదాపు ఏడు లక్షల మంది డిఎడ్, బిఎడ్ విద్యార్థులు డిఎస్‌సికి దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. అంతేకాకుండా గత డిసెంబర్ నెలలో డిఎడ్, బిఎడ్ కోర్సులు పూర్తి చేసుకున్న వారు దాదాపుగా 50వేల పైచిలుకు మంది ఉంటారు. గతేడాది సెప్టెంబర్‌లో బిఆర్ఎస్ ప్రభుత్వం టెట్ నిర్వహించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ పరీక్షను నిర్వహించలేదు. టెట్‌లో ఉత్తీర్ణత సాధించి, డిఎస్‌సికి దరఖాస్తు చేసుకోవాలనే ఆశతో అభ్యర్థులు ఉన్నారు. కాబట్టి, డిఎస్‌సి నోటిఫికేషన్‌తో పాటు, టెట్ నిర్వహించి విద్యార్థులు, నిరుద్యోగుల అవకాశాలు దెబ్బతినకుండా చూడాలి' అని లేఖలో హరీశ్‌రావు పేర్కొన్నారు.

పెరిక కుల కార్పొరేషన్ ఏర్పాటుపై ముత్తినేని హర్షం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెరిక కుల కార్పొరేషన్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదముద్ర వేయడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మ్యానిఫెస్టో కమిటీ చైర్మెన్, మంత్రి దూద్దిళ్ల శ్రీధర్‌బాబు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు ఇతర మంత్రులకు పెరిక కుల రాజకీయ ఐక్యత, కార్పొరేషన్ సాధన సమితి రాష్ట్ర చైర్మెన్ ముత్తినేని వీరయ్య ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు.తమ సామాజిక తరగతి చరిత్రలో ఇది ఒక ఘన విజయమన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు కోసం గత బీఆర్ఎస్ హయాంలో అనేక ఉద్యమాలు చేసినా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టించుకోలేదని విమర్శించారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశాఇన్న గుర్తించిందని తెలిపారు. అంతేకాకుండా కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇందుకు హామీ ఇచ్చిన నెరవేర్చిందని పేర్కొన్నారు.

సమాజంలో విషపు బీజాలు నాటుతున్నారు

అమిత్‌షాపై నిరంజన్ ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సమాజంలో విషపు బీజాలు నాటుతున్నారని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సికింద్రాబాద్‌లో మాట్లాడిన మాటలను ఆయన తీవ్రంగా ఖండించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిరంజన్ విలేకర్లతో మాట్లాడారు. ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామంటూ అమిత్‌షా చెప్పడం ప్రకటించడం అప్రజాస్వామిక చర్య అన్నారు. దేశానికి హోం మంత్రి హోదాలో ఆయన ఒక వర్గాన్ని రెచ్చగొట్టి లబ్ది పొందాలని చూడడం దుర్మార్గమని చెప్పారు. ముస్లింలను వ్యతిరేకిస్తూ మాట్లాడితే హిందువులు మద్దతిస్తారని అనుకోవడం పొరపాటని తెలిపారు.

ఫ్యూచర్.. కన్ఫ్యూజన్..!

బిజెపిలోకి వెళ్లలేక.. కాంగ్రెస్ రానివ్వక..

- అంతర్మథనంలో మామ, అల్లుడు
- కాంగ్రెస్‌తో రాజీకి మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి
- ఇద్దరు ఎమ్మెల్యేల రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకమే..!



మల్లారెడ్డి



రాజశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'పాలు అమ్మిన.. పూలు అమ్మిన.. మెడికల్ కాలేజీలు, ఇంజనీరింగ్ కాలేజీలు పెట్టిన.. ఏడాదికి వేలాది మందిని డాక్టర్లు, ఇంజినీర్లుగా తీర్చిదిద్దుతున్న.. నా కష్టమే దీనంతటికీ కారణం'.. ఈ మాటలు ఎక్కడో విన్నట్టు ఉంది కదా.. వినే ఉంటారు. సాక్ష్యాత్తు మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పలు సందర్భాల్లో చెప్పిన మాటలివి.

దాదాపు దశాబ్దం పాటు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాను ఏలిన మల్లారెడ్డి ఇప్పుడు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష కాంగ్రెస్, బిజెపిలపై విరుచుకుపడ్డ ఆయన పరిస్థితి ఇప్పుడు 'ముందు నుయ్యి.. వెనుక గొయ్యి' అన్నట్టుగా తయారైంది. బిఆర్ఎస్‌లో ఉండలేక.. బిజెపిలోకి వెళ్లలేక.. కాంగ్రెస్ వారు రానివ్వకపోవడంతో మేడ్చల్, మల్కాజిగిరి నియోజకవర్గాల ఎమ్మెల్యేల ఫ్యూచర్ కన్ఫ్యూజన్‌లో పడింది. అక్రమ ఆస్తులు, కబ్జా భూములను ఎలా కాపాడుకోవాలో తెలియక మామ, అల్లుడు అంతర్మథంలో పడ్డారు. అధికారంలో ఉండగా కాంగ్రెస్ పార్టీని, అప్పటి మల్కాజిగిరి ఎంపి, ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో దూషణకు మల్లారెడ్డి సై అంటే సై అన్నారు. ఇప్పుడు అనూహ్యంగా కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో సీన్ రివర్స్ అయ్యింది. రేవంత్‌రెడ్డి చెప్పినట్టుగానే భూ కబ్జాలపై ఫోకస్ పెట్టడంతో మల్లారెడ్డి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మల్లారెడ్డితోపాటు ఆయన అల్లుడు, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి భూ బాగోతాలు ఒక్కొక్కటిగా బయటికొస్తున్నాయి. చివరికి లోక్‌సభ బరి నుంచి తప్పుకుని మరీ కాంగ్రెస్‌తో కాళ్ల బేరానికి వచ్చినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం వీరిద్దరి రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది.

అప్పుడు తొడగొట్టి.. ఇప్పుడు కాళ్ల బేరం..

దుండిగల్ చిన్నదామర చెరువులోని ఆయన అల్లుడు, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కాలేజీ భవనాలను రెవెన్యూ సిబ్బంది పాక్షికంగా కూల్చేశారు. మల్లారెడ్డి కుటుంబ సభ్యులు, బంధు మిత్రులకు హైదరాబాద్ చుట్టుపక్కల ఇంకా చాలా కాలేజీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలూ ఉండటంతో రేవంత్ రెడ్డి ఇచ్చిన ఈ చిన్న 'జలక్'తో మల్లారెడ్డి సైలెంట్ అయ్యారు. ఈ దెబ్బతో ఇన్ని రోజులూ 'మల్కాజిగిరి ఎంపి సీటు మాదే, మమ్మల్ని ఓడించే మొగాడు పుట్టలేదు' అని పలికిన నోటితోనే, ఈ సారి పోటీ చేయడం లేదని చెప్పుకోవడంతోపాటు కాంగ్రెస్‌తో కాళ్ల బేరానికి వచ్చారు.

రాజీనామా చేస్తారా..? 100 ఎకరాలు తిరిగిస్తారా..?

ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరడం ప్రస్తుతం నడుస్తున్న రాజకీయ ట్రెండ్. ఈ ట్రెండ్‌ను ఫాలో కావడంలో మాజీ మంత్రి మల్లారెడ్డి ముందు వరుసలో ఉంటారు. బిఆర్ఎస్ నుంచి బిజెపి, కాంగ్రెస్‌లో చేరాలని మల్లారెడ్డి చూశారు. కానీ రెండు పార్టీలూ షాక్ ఇచ్చాయి. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి పార్టీలో చేరాలని బిజెపి సూచించగా.. కబ్జా చేసిన 100 ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పగిస్తేనే పార్టీలోకి ఆహ్వానిస్తామని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ నేతలు ఆఫర్ ఇచ్చారు. దాంతో మల్లారెడ్డి పరిస్థితి 'రెంటికీ చెడ్డ రేవడి'లా తయారైంది. ఎమ్మెల్యే పదవికి రాజీమానా చేయలేక.. కబ్జా చేసిన భూమిని తిరిగి ఇవ్వలేక మామ, అల్లుడు అంతర్మథనంలో పడ్డారు.

రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకం

మేడ్చల్, మల్కాజిగిరి ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ఇవే చివరి ఎన్నికలు అని ప్రకటించిన మల్లారెడ్డిని పక్కనబెడితే.. మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన రాజశేఖర్‌రెడ్డికి ప్రస్తుత పరిస్థితులు రాజకీయంగా ఎదగలేకుండా చేసేలా ఉన్నాయి. బిజెపి మాటలు నమ్మి రాజీనామా చేసి మళ్లీ బరిలోకి దిగితే గెలుపు అంత ఈజీ కాదు. ఇక కాంగ్రెస్ ఆఫర్‌కు అట్రాక్ట్ అయి కబ్జా భూములను తిరిగిస్తే రూ.వేల కోట్ల నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఈ రెండూ కాకుండా బిఆర్ఎస్‌లోనే కొనసాగుదామంటే రాజకీయంగా ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయంటూ ఇద్దరు ఎమ్మెల్యేలూ పునరాలోచనలో పడ్డట్టు సమాచారం. వీరిద్దరూ ఏ పార్టీలో కొనసాగుతారు..? అసలు రాజకీయాల్లో ఉంటారా..? లేక రాజకీయాల నుంచి తప్పుకుంటారా..? తెలియాలంటే పార్లమెంట్ ఎన్నికల తర్వాత వరకు ఆగాల్సిందే..!

గల్ఫ్ కార్మికుల సంక్షేమం బోర్డును ఏర్పాటు చేయండి

- సిఎంకు మంత్రి పొన్నం లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం బోర్డును ఏర్పాటు చేసేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. మంగళవారం ఇదే అంశంపై సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. గల్ఫ్ దేశాల్లో పని చేసే తెలంగాణ వలస కార్మికుల సామాజిక భద్రతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదన్నారు. వీటిపై తగిన చర్యలు తీసుకోవాలని సీఎం కార్యదర్శి షానవాజ్ ఖాసీంను ఫోన్లో మంత్రి కోరారు. గల్ఫ్ దేశాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. ఆయా కార్మికుల సంక్షేమం, ఎన్నారైల సంక్షేమం' కోసం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలంటూ టిపిసిసి ఎన్నారై విభాగం చైర్మెన్ డాక్టర్. బీఎమ్. వినోద్ కుమార్, కన్వీనర్ మంద భీంరెడ్డి, కాంగ్రెస్ గల్ఫ్ విభాగం కన్వీనర్ సింగిరెడ్డి నరేష్ రెడ్డి, గల్ఫ్ జేఏసీ ప్రధాన కార్యదర్శి స్వదేశ్ పరికిపండ్ల, ఏనుగు రమేష్‌రెడ్డి తదితరులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించిన నేపథ్యంలో ఆయన సిఎంకు లేఖ రాశారు.



సిఎం రేవంత్‌కి హస్తం చిహ్నాన్ని ధరింపజేస్తున్న వంశీచంద్‌రెడ్డి

సిఎంను కలిసిన ఎంపి అభ్యర్థి చల్లా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం రేవంత్ రెడ్డిని మహబూబ్‌నగర్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హస్తం గుర్తు చిహ్నాన్ని ఆయనకు ధరింపజేశారు. మహబూబ్ నగర్‌లో కాంగ్రెస్ చేపట్టిన ప్రచార దీక్షలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన ఆ చిహ్నాన్ని ధరింపజేశారు. అదే విధంగా హిందుస్తాన్ కోకాకోలా బేవరేజెస్ సీఈఓ జాన్ పబ్లోరోడ్రిగ్జ్, ఆ సంస్థ ప్రతినిధుల బృందం మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసింది.

'డబుల్' ఇళ్ల కాలనీల్లో సదుపాయాలు కల్పించాలి

- మంత్రి పొంగులేటికి సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు మంచి నీరు, కరెంటు, రోడ్ల సదుపాయాలు కల్పించి, లబ్దిదారులకు ఇళ్లను స్వాధీనం చేయాలని సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం గృహ నిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి మెమోరాండం అందజేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిసరాల్లో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లల్లో కనీస సౌకర్యాలు లేకపోవడం వల్ల లబ్ధిదారులు అక్కడ నివాసం ఉండే పరిస్థితి లేకుండా పోయిందని చెప్పారు. గతేడాది ఎన్నికల ముందు 42 ప్రాంతాల్లో 60 వేల మందికి ఇళ్లు కేటాయించినప్పటికీ మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతోపాటు లిఫ్టు కూడా పనిచేయడం లేదని వివరించారు. దాంతో లబ్ధిదారులు ఆ ఇళ్లలో ప్రవేశించే పరిస్థితి లేక ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. తమకు సదుపాయాలు కల్పించి ఇళ్లు స్వాధీనం చేయాలని జిహెచ్ఎంసిలో ప్రతి సోమవారం ప్రజావాణిలో వందలాది మంది పేదలు ఫిర్యాదు చేస్తున్నారని చెప్పారు. సదుపాయాలు కల్పించడానికి కనీసం రూ.600 కోట్లు కావాలని జిహెచ్ఎంసి అధికారులే లెక్కలు చెపుతున్నారన్నారు. సదుపాయాలు కల్పించడానికి అవసరమైన బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాలని, త్వరగా లబ్ధిదారులకు ఇళ్లను అందజేయాలని మంత్రిని కోరారు.



శ్రీనివాస్ కుటుంబానికి న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించిన కార్మికులు

పవర్‌లూమ్ కార్మికుడి ఆత్మహత్య

- బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్థిక ఇబ్బందులతో సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పవర్‌లూమ్ కార్మికుడు మంగళవారం ఆత్మహత్య చేసుకున్నారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన తడక శ్రీనివాస్ పవర్‌లూమ్ కార్మికునిగా పనిచేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. అతనికి భార్య లావణ్య, ఇద్దరు కూతుర్లు ఉండగా, కుటుంబ కలహాలతో ఏడేళ్లుగా భార్య పిల్లలతో వేరుగా ఉంటోంది. ఇటు కుటుంబ సమస్యలు.. మరోవైపు మూడు నెలలుగా ఉపాధి లేక, ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. దీంతో శ్రీనివాస్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్

ఆత్మహత్య చేసుకున్న పవర్‌లూమ్ కార్మికుడు తడక శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షులు కోడం రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం అంబేద్కర్ చౌక్ వద్ద వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు నెలల నుంచి వస్త్ర పరిశ్రమ బంద్‌తో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలుమార్లు ఆందోళన చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులతో శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని, ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి వెంటనే 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం వెంటనే ఉపాధి కల్పించి సిరిసిల్లలో మూతబడిన పరిశ్రమలను తెరిపించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 14న సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున 24 గంటల నిరాహార దీక్ష కార్యక్రమాన్ని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జవ్వాజి విమల, గురజాల శ్రీధర్, అన్నల్దాస్ గణేష్, వార్పిన్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్ల సత్యం, గౌరవ అధ్యక్షుడు ఉడుత రవి, పవర్‌లూమ్ నాయకులు నక్క దేవదాస్, గుండు రమేశ్, సబ్బని చంద్రకాంత్, బెజుగం సురేష్, మోర తిరుపతి, వైపని నాయకులు ఎలిగేటి శ్రీనివాస్, అసాముల సంఘం నాయకులు సిరిసిల్ల రవి, చేరాల అశోక్ పాల్గొన్నారు.